


**మోటారుబైకు దొరబాబుదే.**

"థక్ థక్" మెరుస్తూ హోటేలు పక్కనుంది. సరికొత్త మోటరుబైకు దొరబాబుదే.

రోడ్డువార హోటలు పెద్దపాక. అయినా అదేం చిన్న హోటలుకాదు. బస్సులు ఆగేచోటు. పాతిక గ్రామాలవాళ్ళు తెల్లారేసరికి అక్కడికి వస్తారు పాకనిండా పాకడు జనం కిటకిటలాడుతూ కూర్చుని కాఫీ ఫలహారాలు సేవిస్తున్నారు.

నేను లోపలికెళ్ళాను.

"రారా బ్రదర్" అని దొరబాబే నన్ను పిలిచాడు, వాడో బెంచీ మీదున్నాడు. కాస్త చోటు చేసి పెట్టేడు. వెళ్ళి కూర్చున్నాను.

దొరబాబు నన్నంత అభిమానంతో పిలవడం విడ్డూరమే. మేం ఓ ఊరివాళ్ళమే అయినా ఉభయులం మాట్లాడుకునేది తక్కువ." ఓహో అంటే ఓహో" అని పలకరించుకుంటాము. నా తోవని నేను పోతాను వాడి తోవని వాడు పోతాడు, వాడంత అభిమానంతో పిలిచాడూ అంటే విశేషమే!

"సన్నాసీ, ఒకటికాదు. రెండు ప్లేట్లు" అని గట్టిగా అరిచి రెండు వేళ్ళు చూపించాడు దొరబాబు. హోటలు సర్వరు పేరు సన్నాసే వాడు రెండు ప్లేట్ల ఇడ్లీ పట్టుకొచ్చి మా ముందు పెట్టేడు.

"సన్నాసీ ఇటు చూడు. రెండు. ఏమిటి రెండు?" అని వాణ్ణి ప్రశ్నించాడు.

# పణుకుల వాగు

—చాసో కథ ఇది చాసో కథకి రైటప్ ఇవ్వటం— కాస్త సాహసమే! కథానిక అనగానే రొమాన్సూ–చివర్లో– మెరుపుల థ్రిల్లూ కాదూ, ఒక వాతావరణం కూడా– ముఖ్యం అనే విషయాన్ని మరిచిపోతున్నార్రా– కుర్ర రచయితల్లారా అని చెప్పటం కోసమే– ఈ కథ రాసినట్టున్నారు.

## చాగంటి సోమయాజులు

"పెసరట్లు" అన్నాడు సన్నాసి.

"అదిరా ఎదవనాకొడకా. రెండు స్పెషల్ పెసరట్లు, అల్లం మిర్చి బాగా తగిలించమను. తెలుసునుగా నా పెసరట్లు" అన్నాడు దొరబాబు.

"దొరబాబుకి రెండు పెసరట్లు" అని లోపలికి అరిచాడు సన్నాసి. దొరబాబు పెసరట్లు అందరి పెసరట్లు కావు.

"పొద్దున్నే వచ్చేవు" అన్నాడు దొరబాబు. ఎక్కడికి వెళుతున్నావు అని అడగలేదు.

"పట్నం వెళ్ళాలి" అన్నాను.

"చచ్చావ్. వెళ్ళలేవు. ఓ బస్సు మూల పడ్డాది. ఓ బస్సు బ్రేకు తెళ్ళింది" అన్నాడు.

చిక్కు. అన్ని బస్సులూ వస్తూ ఉంటేనే ఖాళీ వుండడంలేదు. రద్దీ ఇంతా అంతా కాదు.

"ఏం చేస్తాం వెళ్ళవలసిందే" అన్నాను.

"వెళ్ళవలసిందే. ప్రయాణాలు తప్పవుగా. నేను ఆరేళ్ళు ఈ బస్సుల్లో ప్రయాణాలు చేశాను. జిల్లా జిల్లా అంతా చుట్టబెట్టి సాయంకాలానికి ఇల్లు చేరుకునే వాణ్ణి. చూస్కో మరి. తలుచుకుంటే ఆ ప్రయాణాలు నేనే చేశానా అనిపిస్తుంది" అన్నాడు

"నీది నిత్య ప్రయాణం" అన్నాను.

"ఆహా నిత్య ప్రయాణమే. ఏభై అరవై మైళ్ళు తిరిగి రాక తప్పదు. బైకు కొన్నాను. బతికాననుకో"

వాడిధోరణిని వాడు చెప్పుకుపోతున్నాడు నేను వింటున్నాను. పట్నం నన్ను బైకు మీద మోసుకుపోతే బాగుణ్ణనుకుంటున్నాను. తీసికెళ్ళు అని చచ్చినా అనలేదు.

"ఆరువేలరూపాయలు—అదనం బ్లాకులో ఇచ్చి కొన్నాను ఏం చెయ్యను, మనకా బండి ఉండాలి. అవసరం" అన్నాడు.

"నీకు అవసరమే" అన్నాను.

"ఊళ్ళో నువ్వొక్కడివే నాకు నచ్చేవు. ఏ వూసుకీపోవు. ఎవణ్ణి చూసీ ఏడవ్వు" అన్నాడు. వాడన్నది నా గురించి నిజమే ఊళ్ళో వాడిమీద చాలామందికి ఈర్ష్యా వుంది, గుర్రూ వుంది.

"నాకెందుకురా గొడవలు. వాళ్ళన్నం మనం తింటామా మనన్నం వాళ్ళు తింటారా? ఏఅమ్మ వండినా ఆ పులుసూ అన్నమే" అన్నాను. నాలిక కరుచుకున్నాను. మా యింటి అమ్మ-అనగా మా ఆవిడ అందరూ తినే పులుసూ అన్నమే పెడుతుంది. ఆ మాట వాడి దగ్గరని చిన్నబోయాను. ఎంచేతా అంటే వాడు ఊళ్ళో అందరిలాగా పులుసు అన్నం తిండంలేదు. వాడి ఇంటిముందు పెంటచూస్తే తెలిసిపోతుంది, తరుచు కోడివెంట్రుకలు కుప్ప పోసి కనబడుతూ ఉంటాయి. రోజుకో కోడి పీకకోసేసి దాని ఈకెలు పీకేసి పెంటకుప్పమీద పోస్తున్నట్టు కనబడుతుంది.

"ఏ అమ్మ వండినా ఆ పులుసూ అన్నమే" అని అనేశాను. చాలా చిన్నబోయాను.

"మంచి మాట అన్నావు" అన్నాడు దొరబాబు. సన్నాసి పెసరట్టు తెచ్చి పెట్టాడు.

"ఓరి సన్నాసీ! రోజూ పరగడపే? ఉప్మా—రెండుప్లేట్ల ఉప్మా-ఈ పెసరట్లకి తగిలించు, ఇలాగచూడు- చెట్నీ-గట్టి చెట్నీ—"

దొరబాబు సన్నాసికి ఆర్డరిచ్చేడు.

"బ్రదర్! ఇవాళ నువ్వు బస్సులో వెళ్ళలేవు. అంచేత నా బైకుమీదపట్నం మోసుకుపోతాను" అన్నాడు.

"బతికించావ్?" అన్నాను వాడామాట అంటాడా అని ఎదురు చూస్తున్నాను అన్నాడు ఎందుకు తీసికెళతానన్నాడు? వాడి హోష, గొప్ప నా దగ్గర ప్రదర్శించడానికా? కావొచ్చు. నాకేం? నాక్కావల్సింది సుఖంగా పట్నం చేరడం.


తిని కాఫీ తాగడానికి అరగంట పట్టింది కాఫీ తాగి వాడు లేపలేడు. హోటల్లో జనం కిటకిటలాడుతున్నారు.

నేను కూర్చోడం న్యాయంకాదు. కానీ దొరబాబు సిగరెట్టు పెట్టె తీసేడు.

నాకో సిగరెట్టు ఇచ్చి తపీగా అగ్గిపుల్ల వెలిగించేడు. తాను ముట్టించుకొని నా సిగరెట్టుకి అగ్గిపుల్ల అందించేడు.



"ప్రియా! నీ అందమయిన పెదాల మీద ముద్దు పెట్టుకోవాలంటే నీకేం ఇచ్చుకోవాలి ఈ దీనుడు?"
"క్లోరోఫాంమ్!"




సిగరెట్టు దమ్ములు తాపీగా తీసి తాపీగా లేచాడు· అప్పుడు ఒంగి బెంచీకింద నుంచి హెల్మెట్ తీసేడు

నేనో పదిరూపాయల నో[illegible] [illegible] వాడి కన్నా ముందు వెళ్ళేను, [illegible] యిద్దామని.

"నువ్వు యివ్వడానికి వీల్లేదు. ఏయ్! వాడి దగ్గర పుచ్చుకోకు" అన్నాడు. హోటలువాడు చచ్చినా నా దగ్గర పుచ్చుకోలేదు. దొరబాబే యిచ్చేడు.

"ఇదిగో నాతో నువ్వు ఎప్పుడొచ్చినా హోటలు బిల్లు నేనే యివ్వాలి. నువ్వు యివ్వకూడదు. నువ్వేకాదు. ఎవరు నాతో కాఫీ తాగినా బిల్లు నేనే ఇవ్వాలి" అన్నాడు. అది వాడి స్టేటస్ బిల్లు వాడే యిచ్చేడు. నేనే యివ్వాలీ అనుకున్నాడు, అంటే వాడు మనకన్నా పదిమెట్లు కాదు, వందమెట్లు పైనున్నాడన్నమాట.

ఆ గీర, గోరోజనం వాడికుంది. వాడి దగ్గర మనం చిల్లిగవ్వకి మారం. ఒకప్పుడు నాకన్నా, చాలామందికన్నా తక్కువవాడు. ఇంతింతై, వటుడింతై, నభోవీధిలో అల్ల తై అని చూస్తూండగా వామనావతారం లాగ ఆకాశమంత ఎత్తు లేచిపోయేడు.

అనేక వ్యాపారాలు చేస్తున్నాడు, రెండేళ్ళు మామిడి తోటలు కొని మామిడి కాయలు బుట్టలు కట్టి రవాణా చేసేడు. రాజా అయిన వ్యాపారం ఎందుకో మానేశాడు. అందులో తెగలాభం వచ్చిందన్నాడు. వాడికి దుకాణం లేదు, ఏ లైసెన్సూలేదు. అమ్మకం పన్నులేదు. రాబడి పన్నులేదు. అనేక వ్యాపారాలు చేస్తున్నాడు. అన్నీ చట్టరీత్యా మహా నేరాలే.

కాఫీ బిల్లు యిచ్చేక తాపీగా రోడ్డుమీదకి వచ్చేడు.

"చూసావా? హెల్మెట్టు - మనం అన్ని జాగ్రత్తలూ తీసుకొంటాం" అన్నాడు. రోడ్డుమధ్య నిలబడ్డాడు. హెల్మెట్టుని ఈ చేత్తో పట్టుకొని ఊపుతూ, ఆ చేత్తో పట్టుకొని ఊపుతూ, ఈ చంకలో పెట్టుకొని, ఆ చంకలో పెట్టుకొని హెల్మెట్టు ప్రదర్శన అందరికీ చేస్తున్నాడు.

బస్సుకోసం ఎదురుచూస్తున్న వాళ్ళ సంఖ్య బాగా పెరిగి పోయింది బస్సులో బస్సుడు జనం వస్తారు. మూడు బస్సుల జనం అక్కడ పోగయేరు. దొరబాబు కదలడంలేదు. ప్రక్క బడ్డీనుంచి కుర్రవాడు వచ్చేడు రెండు కిళ్ళీలు, నాలుగు సిగరెట్టు పెట్టెలూ పట్టుకొచ్చి దొరబాబుకిచ్చేడు.


"ఇందుకోసం మనం యిక్కడింకా ఉన్నాం. ఈ కిళ్ళీ వెయ్యి. కిళ్ళీ ఏమిటనుకున్నావ్? ఎవ్వరికీ ఈ కిళ్ళీ కట్టడు. ఇది మన స్పెషల్. దానిమీద ఈ సిగరెట్టు కాల్చు. మజా చూడు" అన్నాడు. వాడు కిళ్ళీ బిగించి సిగరెట్టు ముట్టించేడు నాకూ యిచ్చేడు. ఘుమఘుమలాడుతూ కిళ్ళీ అద్భుతంగా ఉంది. దానిమీద సిగరెట్టు కాలిస్తే విచిత్రంగానే ఉంది. చాలా బాగుంది చాలా ఖరీదైన సిగరెట్టు.

"ఈ సిగరెట్టు పెట్టెలు పొద్దున్నే వాడు మనకి నాలుగు సప్లయ్ చేయాలి తెల్సిందా? మనకి ఈ నాలుగు పెట్టెలూ ఉంచేవాడు ఎవరికన్నా అమ్మాలి. అయినా ఈ సిగరెట్లెవరూ కొనరులే." అన్నాడు. రోడ్డు చివరనుంచి ఖడ్గమృగంలాగ బస్సువస్తూ కనబడ్డాది ప్రయాణీకులలో కోలాహలం కనబడ్డాది. ఏం లాభం? బస్సు వచ్చింది, ఆగకుండా బస్సు వెళ్ళిపోయింది. బస్సు కడుపుతో వున్న మండ్రకప్పలా ఉన్నాది. దాని టాపునిండా కూర్చుని వెనక నిచ్చెన నిండా నిలబడి జనం ఉన్నారు.

"నేను చెప్పేను చూసేవా? చూడు చూడు చెవల పిల్లుల చినబాబుగారి అవస్థ" అన్నాడు దొరబాబు చినబాబుగారు పాతిక ముప్పయి చెవల పిల్లులని పెంచుతున్నారు అన్నీ తెల్లవే. అది ఆయన సరదా. ఊళ్ళోకి చాలా గౌరవనీయులు. "ఏం? మైకు కొనుక్కొని ఏడవకూడదూ? అన్నాడు దొరబాబు. చినబాబుగారిని వాడు అలాగ్గ అనడం నాకు నచ్చలేదు. చినబాబుగారి కొంగిలే ఊళ్ళోకి పెద్ద లోగిలి. ఈనాడు దొరబాబు ఊళ్ళో చాలా పెద్ద సిమ్మెంటు మేడ కట్టుకొన్న మాట నిజమే. దానికి రెండు లక్షలే అయిందో, ఇంకా ఎక్కువే అయిందో! అంత మేడ కట్టిన వాడికి వెనక ఇంకెంతో ఉండాలి. చినబాబుగారిని ఈసడిస్తూ వాడు అనడం నాకు నచ్చలేదు. సిగరెట్టు దమ్ములు లాగి లాగి పీక పారేసేను.

"ఇంక బయిలుదేరుదాం" అన్నాడు. బతికించేడు. వాడు జాగ్రత్తలు చాలా తీసుకుంటాడు. పంట్లాం జేబులోంచి గాగుల్సు తీసేడు నల్లటి మొహానికి నల్లటి గాగుల్సు తగిలిస్తే గానుగెద్దులాగున్నాడు. తలమీద హెల్మెట్టు పెట్టుకున్నాడు. వాడు మోటారుబైకు ఎక్కేవాడిలా లేదు. అంతరిక్ష నౌకలో అంతరిక్షానికి పోయే వాడిలాగున్నాడు.

మైకుని రోడ్డుమధ్యకి తీసుకొచ్చేడు. అది నిగనిగలాడుతూ కడిగిన నేరేడుపండులా



ఉంది. హేండిలు బారుమీద హైస్పీడులో గాలి ఇబ్బంది పెట్టకుండా షీల్డు ఉంది దొరబాబు గొప్ప జాగ్రత్తలు ఎరిగిన వాడు. జాగ్రత్తలు తీసుకొనేవాడు, వాడు బైకెక్కి ఓ తన్ను తంతే అది గుర్రు మంది. "కూర్చో" అన్నాడు నాతో.

"రెండు కాళ్ళూ పెట్టుకోడానికున్నాయ్. పెట్టుకో. జారబడ్డానికి కెనకున్నాది. జారబడు, నీకు కొత్తా భయమూ ఉంటే నాసీటు వెనక రింగు గట్టిగా పట్టుకో" అని సలహాలు యిచ్చేడు. నేను మోటారు బైకుల వెనకాల కూర్చుని ప్రయాణాలు చాలా చేసేను. ఎక్కి కూర్చున్నాను.

"రడీ-" అన్నాడు. "ఓపదా-" అన్నాను.

వదిలిపెట్టేసేడు. జర్రని స్పీడు అందుకుంది. నా దగ్గర గొప్పకి ఆస్పీడు ఎక్కించేడనుకున్నాను. అది వాడి మామూలు స్పీడేనని తరవాత తెల్సింది. ఆ స్పీడు వాడికి కావాలి. దూరదూరాలు పోయి పనులు ముగించుకొని ఉదయానికి ఉదయం మధ్యాహ్నం యింటికి పోతున్నాడు. జిల్లాజిల్లా అవసరమైతే చుట్టపెట్టుకు వస్తాడు. ఏ ఊర్లో పడితే ఆ ఊర్లో కనబడతాడు. తెగతిరుగుతాడు. నా చెవుల్లో గాలి "గీఁగీఁ" పెట్టడం మొదలెట్టింది. అది మామూలు గీఁగీఁ కాదు. రెండు చెవుల్లోనూ దూరిన కంది రీగల్లాగ గాలి గీఁగీఁ పెడ్తూ పొడుస్తున్నాది. భుజంమీది కండువా తీసి తలకి చుట్టుకోడానికి భయం వేసింది. అది పడవ తెరచాపలాగ విడి, వాడ్నీ, నన్నూ బైకుతోసహా పొలాల్లోకి ఎగరగొడ్తుందేమోననిపించింది. అతి కష్టంమీద మెల్లిమెల్లిగా విప్పి తలకి చుట్టుకొన్నాను. కళ్ళనీళ్ళు తుడుచుకొని కళ్ళకి గాలి తగలకుండా తలకాయ దించుకున్నాను. అటుంచి లారీ వస్తున్నాది. ఇటుంచి లారీ వెళుతున్నాది. ఆ రెండింటి మధ్య నుంచీ బైకుని తీసుకుపోయేడు. రెండెడ్ల బాను వెళుతూంటే రోడ్డు ఒడ్డునుంచీ అంత స్పీడులోనూ పోనిచ్చేడు నాకు భయం పట్టుకుంది. పణుకుల వాగు దగ్గరపడుతున్నాది. దాన్ని అందరూ ఎరుగుదురు కదా? దాని బ్రిడ్జి ఎంత

ఎత్తున ఉంది? రోడ్డు ఎంత ఎత్తుకి లేస్తుంది? అక్కడి నుంచి ఎంత కిందికి దిగుతుంది? ఆ బ్రిడ్జి దగ్గర కాస్త జోరు తగ్గించమని చెబుదామనుకుని తర్జనభర్జన పడుతున్నాను. ఇంతలోనే వాగు వచ్చేసింది. అంత స్పీడుతోనూ బైకుని బ్రిడ్జి ఎక్కించేడు. అంత స్పీడుతోనూ బ్రిడ్జిదించేడు. రోడ్డునపడి జామ్మనివదిలి పెట్టెడు. మహాప్రమాదమయిన ఎగుడు, మహా ప్రమాదమయిన దిగుడు. భయం పట్టుకుంది.


స్పీడు తగ్గించమని చెబుదామనుకుంటూనే ఉన్నాను. మేము కూర్చున్నచోటునే, సీట్లమీద కూర్చున్నాం. రోడ్డు క్షణాలమీద మైళ్ళకి మైళ్ళు వెనక్కి అదృశ్యమయి పోతున్నాది. మేం ముందుకి పోతున్నాం.

మూడు రోడ్ల జంక్షన్ గ్రామంవచ్చింది. అంటే సగంపైన ప్రయాణం అయిపోయిందన్నమాట - అని నేననుకుంటూన్నానో లేదో బైకుతో సమానంగా పరిగెడుతూ, గట్టిగా మొరుగుతూ కుక్క తరుముకొచ్చింది. అది మీద పడిపోతుందేమో అని భయపడ్డాను. లిప్తకాలంలో దాని మొరుగులు వెనకబడిపోయాయి. బైకు రెండు ఒంపులు కొట్టింది. నా గుండె ఒంపులు కొట్టింది. వాడు మాత్రం ఠంచనుగా కూర్చుని బైకుని లాక్కుపోతున్నాడు. చాలా సమర్థవంతంగా ఒంపులని తట్టుకొని పోనిస్తున్నాడు. మూడోసారి మరో ఒంపుకొట్టింది. "దొరా!" అని గట్టిగా అరిచేను. వాడికి వి ని పిం చ లే దు. వి ని పిం చే సా వ కా శం లే దు. వాడి చెవులోకి వంగి. అరిస్తే తప్ప వినబడేట్టు లేదు. నా నోట్లో మాటని నోటిలోంచే గాలి వెనక్కి మోసుకుపోతున్నాది. స్పీడు తగ్గించరా బాబూ, ప్రమాదం! అని చెబుదామనే అనుకుంటున్నాను. గుంజాటన పడుతూనే ఉన్నాను. చేత్తో తట్టి చెప్పనా, అనుకున్నాను.

ఒరి పిరికి వెధవా, అంటాడనిపించింది. అంటాడు ఖాయమే.

అటూయిటూ చూడ్డంమానేసి వాడివీపుని చూస్తూకూర్చున్నాను. అది కదలకుండా నిఠారుగా ఉంది. వాడి వెన్నెముకకి వంపులేదు. కొంచెం సేపట్లోనే తల పక్కకి తిప్పిచూసి నిర్ఘాంతపోయేను. పట్నం దగ్గర పడిపోయింది. ఊరికి చిట్టచివర రోడ్డువార సుస్వాగతం చెపుతూ బోర్డు కనపడి అదృశ్యం అయిపోయింది సిటీబస్సులు కనడ్డాయి ఏడు గంటలైనా కాలేదు. రోడ్డు రద్దీలేదు. మైన్ రోడ్డు మీద ఉన్నాం. అప్పుడు దొరబాబు స్పీడు తగ్గించి బాగా తగ్గించి, వెనక్కి తిరిగి "నిన్నెక్కడ దింపమన్నావ్?" అని అడిగేడు "ఇక్కడే దింపి" అని ఠకీమని నా నోట్లోంచి వచ్చింది. అది వాస్తవంగా నేననలేదు. అంతర్గతంగా నాలో ఉన్న భయం నాచేత అనిపించింది వాడు బండి ఆపేడు.

"ఇక్కడెందుకు ఆపేనో తెలుసా,చూడు ఈ రోడ్డు చివరికి పోతే నేను కొన్న ఇంటి స్థలం వెయ్యి గజాలు ఉంది. రెండు లక్షలిస్తామంటున్నారు. వచ్చినా యివ్వను. ఏ లాడ్జింగ్ హవుసో మనమే కడదాం." అన్నాడు. "తప్పకుండా




కట్టు. నువ్వుకాకింకెవరు కడతారు? కానీ యమస్పీడులో వచ్చేవు" అన్నాను.

"అది మన మామూలు స్పీడే. ఆస్పీడు లేకపోతే ఈ బండి ఉండి ఎందుకు?" అన్నాడు.

"మంచి ఉపకారం చేసేవు. థేంక్స్." అన్నాను.

"నో మెన్షన్" అని ముందుకు సాగిపోయేడు నేను కన్నెత్తేసరికి మైన్‌రోడ్డు చివర అదృశ్యం అయిపోయేడు.

నిజంగా నేను మరో అరమైలుకి పైగా మైన్‌రోడ్డు చివరికి వెళ్ళవలసి ఉంది. వాడు ఆపేసరికి భయమే నన్ను దింపేసింది. పక్కనున్న రిక్షావాడినడిగితే మూడు రూపాయలిమ్మన్నాడు మా ఊరు నుంచి బస్సుచార్జీ పట్నానికి నాలుగు రూపాయలు. అందుకు నేను నడక పుచ్చుకున్నాను.

హోటల్లో తాగిన కాఫీవేడి, వాసనానోట్లో ఉన్నట్టే ఉంది. పెసరట్టు అల్లం తేన్పు వస్తూనే ఉంది. నలబై కిలోమీటర్లు ముప్పై నిముషాల్లోవచ్చి పట్నం మైన్‌రోడ్డుమీద ఉన్నాను. పరమాశ్చర్యం వేసింది.

పెందరాళే పట్నం వచ్చేనేమో నా పని బాగా సానుకూలం అయింది. సాయంత్రం బస్సూ దొరికింది. తిరుగు ప్రయాణం హాయిగా ఉంది.

ఊళ్ళోకెళ్ళేను. ఘోరమైన వార్తవిన్నాను దొరబాబు ఏక్సిడెంటయి చచ్చిపోయేడు. పణుకులవాగు బ్రిడ్జి ఎత్తుకి ఎక్కి పల్లానికి దిగడంలో వాగులోనికి బోల్తా కొట్టేసేడు (పణుకులమీదపడి వాడిబైకు పప్పుపప్పు అయిపోయింది. వాడు పచ్చడిపచ్చడి అయిపోయేడు) శవ పంచాయితీలో వాడిదగ్గర నాలుగు బంగారంబిస్కత్తులు దొరికేయి. కొన్ని సంవత్సరాలై బంగారం వ్యాపారం చేస్తున్నాడని ఎవరికీ తెలియదు. చచ్చిపోయేకే వాడు ముప్పయి లక్షల సంసారి అనితేలింది.